# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 23 సెప్టెంబరు , 2026 | పేజీలు : 07




కొలువుదీరిన పోచంపల్లి పిఎసిఎస్ పాలకవర్గం




# పేదలకు మెరుగైన వైద్యం కోసం సిఎంఆర్‌ఎఫ్‌కు ప్రత్యేక బడ్జెట్

### ప్రతి కుటుంబానికి వైద్యం భారం కాకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/మునుగోడు :** పేద, మధ్యతరగతి ప్రజలకు ఖరీదైన వైద్యం భారంగా మారుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని మరింత పెంచాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సీఎంఆర్‌ఎఫ్ నిధులను కనీసం 50 శాతం మేర పెంచడంతో పాటు, తీవ్రమైన అనారోగ్యాలతో బాధపడుతున్న పేదలకు త్వరితగతిన ఆర్థిక సహాయం అందేలా విధానాలను సరళీకరించాలని సూచించారు. మంగళవారం మునుగోడులోని సిపిఐ కార్యాలయంలో మునుగోడు నియోజకవర్గ పరిధిలో మంజూరైన 11 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోలుగూరి నరసింహ, బచ్చనగోని గాలయ్య, తీర్పారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శులు చాపల శ్రీనివాస్, చండూరు మండల కార్యదర్శి నలప రాజు సతీష్, ఈదులకంటి కైలాస్, బోడిగె సైదులు, సత్యం, మందుల పాండు, వెంకన్న, కట్కూరు లింగస్వామి, గోపగోని ఉదయ్ పాల్గొన్నారు.

**విఒఎల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి**

మండలంలోని వివిధ గ్రామాల వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల వీఓఏలు మంగళవారం సిపిఐ కార్యాలయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. వీఓఏల సమస్యలపై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందజేసిన వారిలో పిట్టల రఘు, దొడ్డి రవి,జనిగల ముత్యాలు, వనం వెంకన్న, అహల్య, రిజ్వానా, తులసి, సునీత తదితరులు ఉన్నారు.




# డిజె మోత.. గుండె కోత

### పట్టణాల నుంచి పల్లెలకు విస్తరించిన డిజె సంస్కృతి

### నేడు విఘ్నేశ్వరుని శోభాయాత్ర

### శబ్ద కాలుష్యంతో ఆరోగ్యానికి పెనుముప్పు

### భారీ విగ్రహాలు, డిజె వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం

### డిజెలకు అనుమతి లేదు: పోలీసులు

### ఉపాధి కోల్పోతున్నాం: డిజె నిర్వాహకులు

**ప్రజా పక్షం/నకిరేకల్:** పండుగంటే ఆనందం.. పెళ్లంటే ఆత్మీయత.. ఊరేగింపంటే ఉత్సాహం. కానీ ఇప్పుడు వేడుక ఏదైనా డీజే మోత తప్పనిసరిగా మారింది. పుట్టినరోజు నుంచి పెళ్లి వరకు.. రాజకీయ సభలు, ర్యాలీల నుంచి వినాయక శోభాయాత్రల వరకు భారీ శబ్దాలు హోరెత్తుతున్నాయి. గతంలో ఈ సంస్కృతి పట్టణాలకే పరిమితమై ఉండగా.. ఇప్పుడు పల్లెలకూ పూర్తిగా విస్తరించింది. దీంతో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారిపై శబ్ద కాలుష్య ప్రభావం పెరుగుతోంది. విఘ్నేశ్వరుడి నవరాత్రులు పూర్తిచేసుకుని బుధవారం శోభాయాత్రలు కొనసాగుతున్న వేళ డీజేల వినియోగంపై మరోసారి చర్చ మొదలైంది. వినోదం కోసం చేసే వేడుకలు ఆరోగ్యానికి, భద్రతకు ముప్పుగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన సమయం ఇది.

**శబ్దం పెరిగితే.. ముప్పు పెరుగుతుంది**

డీజేల్లో మితిమీరిన శబ్దం చెవులకు మాత్రమే కాకుండా శరీరంపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎక్కువసేపు అధిక శబ్దానికి గురైతే వినికిడి లోపం, భయాందోళన, తలనొప్పి, నిద్రలేమి, చిరాకు, మానసిక ఒత్తిడి, వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. గుండె స్పందన, రక్తపోటులో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.తీవ్ర శబ్దం వల్ల గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయిన అనేక ఘటనలు కూడా వెలుగుచూస్తున్నాం. గుండె, రక్తపోటు సమస్యలు ఉన్నవారితోపాటు చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో ఉన్నవారు అధిక శబ్దానికి దూరంగా ఉండాలి. వినాయక శోభాయాత్ర, నిమజ్జనాలు తరువాయి 2లో

## 40వరోజుకు బుల్లెట్ ట్రైన్ రిలే నిరాహార దీక్ష





# అర్హులందరికీ రేషన్ కార్డులు

### ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

**ప్రజాపక్షం/మోతె :** అర్హులందరికీ రేషన్ కార్డులు అందించడం జరుగుతుందని కోదాడ శాసన సభ్యురాలు నలమాద పద్మావతి రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలనలో అర్హులైన తరువాయి 2లో

# డిజె మోత.. గుండె కోత

(మొదటి పేజీ తరువాయి)

శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటన లకు తావులేకుండా నిర్వహించాలి. పోలీసులు, అధి కారులు సూచించిన మార్గాలు, నిర్దేశించిన నిమజ్జన ప్రదేశాల్లోనే విగ్రహాలను తరలించి నిమజ్జనం చేయా లని సూచిస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిం చకుండా, అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బం ది లేకుండా సహకరించాలని కోరుతున్నారు. విగ్రహా లను తరలించే సమయంలో వాహనాలు, విద్యుత్ తీగలు, స్తంభాల విషయంలో అప్రమత్తంగా ఉండా లని. విఘ్నేశ్వరుడి ఆశీస్సులు అందరిపై ఉండేలా.. శోభాయాత్ర భక్తి, ఆనందం, సామరస్యానికి ప్రతీకగా నిలవాలి. భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి నిమజ్జనాన్ని ప్రశాంతంగా పూర్తిచేద్దాం. మన సంబరం కోసం ఇత రులకు ఇబ్బంది కలిగించకుండా.. ప్రమాదాలకు తావి వ్వకుండా..ఆనందం మాత్రమే మిగిలేలా వేడుక జరు పుకుందాం.

**సంప్రదాయ వేడుకలే ప్రత్యామ్నాయం**

డప్పులు, బ్యాండు మేళాలు, మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాలు, నృత్యాలు, జానపద నృత్యాలు, ఇతర ప్రాచీన కళారూపాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. భక్తిగీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సామాజిక సందే శాలతో కూడిన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా శబ్ద కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు స్థానిక కళాకారులకు ఉపాధి కల్పించవచ్చు.

**ఉపాధికి గండం: డిజె నిర్వాహకులు**

డీజే పరికరాల కోసం లక్షల రూపాయలు వెచ్చించి ఉపాధి పొందుతున్న యువకులు అనేకమంది ఉన్నారు. శుభకార్యాలు, వినాయక చవితి వంటి సంద ర్భాల్లోనే గిరాకీ ఉంటుందని, నిబంధనలతో ఉపాధి కోల్పోతున్నామని కొందరు నిర్వాహకులు చెబుతు న్నారు. ప్రజల భద్రతకు భంగం కలగకుండా నిబంధ నలకు లోబడి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపా లని కోరుతున్నారు.

**డిజెలకు అనుమతి లేదు: సిఐ హరిబాబు**

నకిరేకల్ పట్టణ సీఐ హరిబాబు మాట్లాడుతూ.. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు బుధ వారం నిర్వహించే వినాయక శోభాయాత్రకు డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. నిబంధనలు ఉల్లం ఘించి డీజేలు ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులు, నిర్వాహ కులు సామరస్యంగా శోభాయాత్ర నిర్వహించాలని కోరారు. చిన్న సౌండ్ బాక్సులు, బ్యాండు మేళాలు, కోలాటాలు, నృత్యాలు, చప్పట్లతో ప్రాచీన సాంప్రదా యాలు ఉట్టిపడేలా శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

నిరుపేదలందరికి రేషన్ కార్డులు అందించి ప్రతి ఒక్కరికి 6 కేజీల సన్న బియ్యాన్ని అందించడం జరుగుతుందన్నారు. కొత్తగా పెండ్లి చేసుకున్న దంపతులకు వేరు వేరుగా కార్డు అందించి పిల్లలు పుట్టిన వారికి ఆధార్ కార్డు కలిగి ఉన్న చిన్నారు లందరికి స్మార్ట్ రేషన్ కార్డుల్లో అవకాశం లభి స్తుందని తెలిపారు. మండల వ్యాప్తంగా సుమారు 15,621 రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు 45వేల 481 యూనిట్ల బియ్యానికి అనుమతులు వచ్చి నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ మోహ న్‌బాబు, ఆర్‌డిఓ సూర్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి శ్యాంప్రసాద్ రెడ్డి, తహశీల్దార్ ఎం.వెంకన్న, ఎంపిడిఓ సందీప్‌కుమార్, డిటి పుష్ప, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి పుల్లారావు, మ ండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెలుగు వీరన్న, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.


## ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర

ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో గణేష్ నిమ జ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్లు ఇతర భద్రతా ఏర్పాట్లు చేపట్టి నట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్, తెలిపారు. గణేష్ విగ్రహాల ఎత్తును బట్టి ప్రత్యేక నిమజ్జన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను ఏర్పాటు చేసి నట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జన సమయంలో భక్తు లు, నిర్వాహకులు పోలీస్‌శాఖ సూచించిన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంత రాయం కలగకుండా పోలీసుల సూచనలకు అను గుణంగా ఊరేగింపులు నిర్వహించాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని గణేష్ విగ్రహాలు, మండ పాలకు జియో ట్యాగింగ్ చేసి తమకు కేటాయిం చిన నంబర్లతో శోభాయాత్ర ప్రశాంత వాతావర ణంలో జరిగేలా చర్యలు తీసుకోనున్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు ముందుగానే తమ విగ్రహాల ఎత్తును పరిశీలించుకుని, నిర్దేశిం చిన నిమజ్జన ప్రదేశాలకు అనుగుణంగా రూట్ ప్లాన్ చేసుకోవాలని సూచించారు.

## వికసించిన అరుదైన నాగలింగ పుష్పం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీలో మొక్క నాటిన 13 సంవత్సరాల తర్వాత శివలింగ ఆకారంలో నాగలింగ పుష్పం పూసిం



దని యాజమాని కట్టా లవన్‌కుమార్‌రెడ్డి తెలి పారు. నాగలింగ పుష్పం ప్రత్యేకత పువ్వు మధ్య భాగంలో శివలింగాన్ని పోలిన నిర్మాణం కనిపి స్తుంది. దాని చుట్టు నాగుపాము పడగను పోలిన ఆకృతి ఉన్నట్లు కనిపించడం వల్ల దానికి నాగ లింగ పుష్పం అనే పేరు వచ్చింది. ఈ కారణంగా హిందు సంప్రదాయంలో దీనికి శివారాధనతో ప్రత్యేక సంబంధం ఉందని భావిస్తారు. ముఖ్యం గా శివాలయాల్లో పూజకు, అలంకరణకు ఈపు ష్పాలను ఉయోగించే సంప్రదాయం కొన్ని ప్రాం తాల్లో ఉంది. పువ్వు సాధారణ పుష్పాల కంటే చాల భిన్నంగా పెద్దదిగా, ఆకర్షణీయంగా ఉం టుంది. ఈ చెట్టు పుష్పాలు సాధారణంగా కాండం లేదా బలమైన కొమ్మల నుంచి నేరుగా గుత్తులుగా రావడం దీని మరో ప్రత్యేకత.

## కొలువుదీరిన పోచంపల్లి పిఎసిఎస్ పాలకవర్గం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి నూతన పిఎసిఎస్ పాలక వర్గం సోమవారం కొలొవుదీరింది. కొన్నినెలలుగా ఎదురు చూస్తున్న నూతన సహకార సంఘం కమిటీకి తెరపడింది. తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన దరిమిల డిసిఓ నాగార్జున నాన్ అఫీషియల్ సహకార సంఘం పాలక వర్గంచే అధికారికంగా ప్రమాణం స్వీకారం చేయించారు. చైర్మన్‌గా పాక మల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్‌గా కొట్టం కరుణాకర్ రెడ్డి, నాన్ అఫీషియల్ మెంబర్స్‌గా సామల రాజిరెడ్డి, గుండ్ల వేణు, రావుల అనిల్, వారాల రామ చంద్రా రెడ్డి, చెక్క వెంకటేషం, దేశట్ల మల్లేష్, ఆర్ల బలయ్య , యాట కైలాసం, పావిరాల లింగమ్మ, రమా వత్ చందు, సరిపల్లి రాములమ్మలు అధికారికంగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు నూతన పాలక వర్గానికి ఘనంగా సన్మానం చేసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ సురేష్, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు కౌన్సిలర్స్, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, కో ఆప్షన్ మెంబర్స్, సిఈవో బాల్ రెడ్డి టై అండ్ డై సహ కార సంఘం అధ్యక్షులు భారత లవకుమార్‌లు వివిధ గ్రామాల సర్పంచ్ లు అధికారులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొ న్నారు.

## సాగర్ ఆయకట్టు రైతాంగాన్ని క్షోభకు గురిచేస్తున్న ప్రభుత్వం



వినూత్నంగా దున్నపోతుకు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లం

**ప్రజాపక్షం/మునగాల:** నియోజకవర్గ పరిధిలోని రైతులకు నాణ్యమైన విద్యుత్, సాగునీరు అందించ డంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మంగళ వారం మండల కేంద్రంలో భారీ ఎత్తున రైతులతో కలిసి సబ్‌స్టేషన్ ముందు నిరసన కార్యక్రమాలు చేప ట్టారు. ఆగ్రహించిన రైతులు 33కెవి సబ్‌స్టేషన్ ముట్ట డించడంతో పాటు, 65వ జాతీయ రహదారిపై బైఠా యించి రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం మొద్దు నిద్ర నినదిస్తూ, మూగ ప్రభుత్వానికి ప్రతీకగా దున్న పోతుకు వినతిపత్రం అందించి నిరసనను వినూ త్నంగా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమా ర్‌రెడ్డి అడుగడుగునా రైతులను క్షోభకు గురిచేస్తున్నా డని ఇందుకు వారు ముక్కు నేలకు రాయాలని ఆయన డిమాండ్ చేశారు. బొగ్గు, నీళ్లు పుష్కలంగా ఉన్నప్పటికీ రైతులకు కరెంటు ఇవ్వలేని అసమర్థ స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు.అనంతరం రాస్తారోకో చేస్తున్న మల్లయ్యయాదవ్‌ను పోలీసులు అక్కడి చేరుకుని సర్ది చెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్ర మంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తొగరు రమేష్, కందిబండ సత్యానారాయణ, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

## అన్నిదానాల్లోకెల్లా అన్నదానం మహాదానం

తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అన్నిదానాల్లోకెల్లా అన్నదానం మహాదానమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 30వ వార్డు శ్రీశ్రీనగర్‌లో పాలకుర్తి వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీగ ణనాధుడి విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నవితరణ కార్యక్ర మాన్ని ప్రారంభించి మాట్లాడారు. గణేష్ నవరాత్రుల ద్వారా ప్రజల్లో భక్తి భావన పెరుగుతుందన్నారు.



ఆధ్యాత్మిక అభివృద్ధికి ఇటువంటి ఉత్సవాలు దోహదప డుతాయన్నారు. నవరాత్రుల సందర్భంగా అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు ప్రముఖులు పాల్గొన్నారు.

## 40వ రోజుకు చేరిన బుల్లెట్ ట్రైన్ రిలే నిరాహార దీక్ష

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 40వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బుల్లెట్ సాధన సమితి కమిటి, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు దీక్షలో కూర్చోగా వారికి పలువురు అఖిలపక్షాల నాయకులు సంఘీభావం తెలిపి మాట్లా డారు. కేంద్రం ముందుగా ప్రకటించిన విధంగా జాతీయ రహదారి 65కు సమాంతరంగా సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ అలైన్ మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సీనియర్ జర్నలిస్టులు కందుకూరి యాదగిరి, గుంటి శ్రీనివాస్, గుంటి కీర్తన శ్రీనివాస్, వెలుగు వనిత, యర్కచర్ల శోభా రాణి, కార్తీక్ దీక్షలో కూర్చోగా సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి, ధర్మార్జున్, సట్టు నాగయ్య, జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షులు మీసాల గోవర్ధన్, సామేల్ కిరణ్, దేవిడ్ రాజు తదితరులు సంఘీభావం తెలిపారు.


## నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు సూర్యాపేట మున్సిపా లిటి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, కమిషనర్ హన్మంత రెడ్డి తెలిపారు. బుధ వారం నిర్వహించనున్న నిమజ్జనం సందర్భంగా సద్దల చెరువు కట్టపై ఏర్పాటు చేసిన పనులను వారు పరిశీలించి మాట్లాడారు. నిమజ్జన కోసం చెరువు కట్టపై మూడు భారీ క్రేన్లను ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. భక్తుల భద్రత కోసం చెరువు కట్టపై లైటింగ్, భారీ కేడింగ్‌తోపాటు అనౌన్స్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివ రించారు. నిమజ్జన వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా ప్రధాన రహదారులపై ఉన్న గుంతల్లో గ్రావెల్, డస్ట్ పోసి రహదారు లను చేసినట్లు చెప్పారు. మున్సిపాలిటి నుంచి మొత్తం 332 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ప్రజలు మున్సిపాలిటికి సహకరిస్తూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్య క్రమాన్ని పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ ఈఈ ఎం. కిరణ్, డిఈ ప్రణయ్ రెడ్డి, ఏఈ తిరుమలయ్య, ఇంచార్జి శానటరి ఇన్‌స్పెక్టర్ యాదగిరి, జూనియర్ అసిస్టెంట్లు ఎండి గౌసుద్దీన్, ఎస్‌ఎస్‌ఆర్ ప్రశాద్, సయ్యద్ సమ్మి పాల్గొన్నారు.

## మిల్లర్లపై దాడులు నిలిపివేసి ప్రభుత్వం చర్చలు జరపాలి

రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొండమీది గోవిందరావు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రైస్ మిల్లర్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక దాడులను వెంటనే నిలిపివేసి మిల్లర్లతో ప్రభుత్వం జరిపి చర్చలు పరిష్కరించాలని రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొండమీది గోవింద రావు, కార్యదర్శి నరసింహా రావు డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలె క్టరేట్ కార్యాలయం వద్ద మంగళవారం నిరాహార దీక్షలో మాట్లా డారు. సిఎంఆర్ ఒప్పందాన్ని ఇరుపక్షాలకు ఆమోదయోగ్యంగా ఉండేలా రూపొందించాలని, టెస్ట్ మిల్లింగ్ ద్వారా అవుట్ బర్న్ రేషి యోను ఖరీఫ్, రబీ పంటలకు వేరువేరుగా నిర్ధారించి క్వింటాల్ ధాన్యానికి బిల్లింగ్ ఛార్జీని 150కు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2014 నుంచి రావాల్సిన సివిల్ సప్లై మిల్లింగ్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైయేజ్ చార్జీలను చెల్లించి, 25 శాతం ఫెనాల్టీ, 12 శాతం వడ్డీని మాఫీ చేయాలని కోరారు. ఖరీఫ్ ధాన్యాన్ని పూర్తిగా రా రైస్‌గా, రబీ ధాన్యాన్ని పూర్తిగా బాయిల్డ్ రైస్‌గా స్వీకరించి ఎఫ్‌సిఐ కఠిన మైన నిబంధనలను సడలించి రైస్ మిల్లర్ల 13 డిమాండ్లు పరిష్కరిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ జిల్లా కోశాధికారి వంగవీటి నాగరాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు బచ్చు ఉపేందర్, చౌగాని బిక్షపతి, గౌరవ సలహాదారులు కాసాని వెంకటేశ్వర్లు, వజ్ర రైస్‌మిల్ నిర్వాహకులు వట్టె జానయ్య యాదవ్, మల్లారెడ్డి, మధు, మురళి పాల్గొన్నారు.



## సహజ వ్యవసాయంతో రైతులకు మేలు

ప్రజాపక్షం/నార్కట్‌పల్లి : రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులపై ఆధార పడకుండా సహజ వ్యవ సాయ పద్ధతులను అవలం బించి తక్కువ ఖర్చుతో



నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని జ్యోతి రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ జ్యోతి రెడ్డి దుడ్డిపాల అన్నారు.జ్యోతి రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నార్కట్ పల్లిలో సహజ వ్యవసాయ అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహజ వ్యవ సాయం వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేల సహజ సారాన్ని కాపాడుకోవచ్చన్నారు.కార్యక్రమంలో భాగంగా రైతులకు సేంద్రియ ఎరువును పంపిణీ చేశారు.ఆరోగ్యకర మైన నేలఆరోగ్యకరమైన పంటఆరోగ్యకరమైన సమాజం" అనే లక్ష్యంతో ఫౌండేషన్ ముందుకు సాగుతుందని నిర్వాహ కులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కర్నాటి వెంకన్న,ఏవో గౌతమ్,ఏఈవో శిరీష, రైతులు,స్థానిక ప్రజలు,ప్రజాప్రతిని ధులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి నివారణే లక్ష్యం

ప్రజాపక్షం/నకిరేకల్(శాలిగౌరారం ) :హెచ్ఐవీ,ఎయిడ్స్ పై ప్రజల్లో అవగాహన కల్పిం చేందుకు శాలిగౌరారం మండల కేంద్రంలోని మార్కెట్ సెంటర్ లో కళా



జాతర నిర్వహించారు.రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదనపు అధికారి డాక్టర్ శంకర్ పర్యవేక్షణలో,డిపిఎంవో సుధాకర్ ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.నల్లగొండ చెందిన శ్రీ సాయి ఆర్ట్స్ అకాడమీ కళాకారులు కళాప్రదర్శనల ద్వారా ప్రజలకు చైతన్యం కల్పించారు.వ్యాధి నివారణకు రక్షణ చర్యలు పాటించాలని, కండోమ్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. హెచ్ఐవీకి సంబంధించిన సమాచారం, సందేహాల నివృత్తికి 1097 టోల్ ఫ్రీ నంబర్ ను సంప్రదించాలని, బ్రేక్ ఫ్రీ యాప్ ద్వారా వివరాలు తెలుసుకో వచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్ డబ్ల్యుఎస్ తీగల గోవర్ధన్, కళాబృంద సభ్యులు లింగస్వామి,రామ కృష్ణ,పాపయ్య,జైకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీర్ల అయిలయ్య ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

### మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ప్రజాపక్షం/నకిరేకల్: ఆలేరు ఎమ్మెల్యేగా మూడేళ్లలో బీర్ల అయిలయ్య కూడబెట్టిన ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని నకిరే కల్ మాజీ ఎమ్మెల్యే చిరు మర్తి లింగయ్య డిమాండ్



చేశారు. నకిరేకల్‌లోని సువర్ణ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రియల్ ఎస్టేట్, మట్టి, ఇసుక దందాలతో అయిలయ్య వందల కోట్లకు ఎదిగారని ఆరోపించారు. యాదగిరిగుట్ట, మోసాయి పేట, రాజాపేట, తుర్కపల్లి, బొమ్మలరామారం,ఆత్మకూ రు(ఎం) ప్రాంతాల్లో భూములు,వెంచర్లకు సంబంధించి పలు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. యాదగిరిగుట్టలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడ్డారన్న ఆరోపణలపైనా సమాధానం చెప్పాలని కోరారు.గతంలో మారుతీ 800 కారు ఉన్న అయిలయ్యకు ప్రస్తుతం పలు ఖరీదైన వాహ నాలు,హిటాచీలు,టిప్పర్లు ఉన్నాయని, సుమారు రూ.3 కోట్ల విలువైన డిఫండర్ కారును కూడా కొనుగోలు చేశారని లింగయ్య పేర్కొన్నారు.ఇరిగేషన్, వైద్యారోగ్య శాఖల మంత్రిగా హరీశ్‌రావు హయాంలో ఆలేరు నియోజకవర్గంలో రూ.43.50 కోట్లతో 34 చెక్‌డ్యామ్‌లు,సుద్దాల వద్ద రూ.14 కోట్లతో చెక్‌డ్యామ్‌తో కూడిన వంతెన, యాదగిరిగుట్ట ప్రభుత్వ వైద్య కళాశాలకు రూ.84 కోట్ల నిధులు, పలు ఆసు పత్రుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొప్పుల ప్రదీప్ రెడ్డి ,ప్రగాఢపు నవీన్ రావు, మారం వెంకట్ రెడ్డి, సామ శ్రీనివాస్ రెడ్డి , పాల్గొన్నారు.

# క్రీడల వల్ల కీర్తి ప్రతిష్టలు- వేణుగోపాల్‌రెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు క్రీడల్లో రాణించి మిర్యాలగూడ ప్రాంతానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని నూకల ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు నూకల వేణు గోపాల్‌రెడ్డి కోరారు. కోదాడ ఎస్ఆర్ఎం ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో కేంద్రీయ విద్యాలయానికి చెందిన నలుగురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం జూని యర్ కళాశాల ఆవరణలో విజేతలైన విద్యార్థులను నూకల వేణుగోపాల్‌రెడ్డి ప్రత్యేకంగా పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఆటల్లో పట్టు సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరిసి ఒలింపిక్స్ వరకు ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయికి ఎంపి కైన వారిలో అండర్14 ఓపెన్ సైట్ విభాగంలో డి.హర్షిత్‌రాథోడ్, అండర్17 పిసిపి విభా గంలో ప్రణతి, శ్రీలాస్య, అండర్19 ఓపెన్ సైట్ విభా గంలో నిఖిల్ ఉన్నారని తెలిపారు.నూకల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ విద్యార్థుల నైపుణ్యాల పెంపునకు ఎంతో ఉపయోగపడిందని కోచ్, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాటు కోచ్ సతీష్‌ను కూడా ప్రత్యేకంగా అభినందిం చారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ఇంఛార్జి ప్రిన్సిపాల్ రవి, పీడీలు వెంకటేశ్వర్లు, వెంకట రత్నం, జనార్ధన్, అశోకచారి, నాగరాజు, గుడిపాటి కృష్ణ, పాతూరు శరత్, అనిల్, ఉపాధ్యాయులు, విద్యా ర్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ స్థాయిలో ఆయుష్ సేవలు

### డాక్టర్ రవి నాయక్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ఆయుష్ శాఖ సేవలను గ్రామీణ స్థాయిలో మరింత విస్తృతపరచి ప్రజలకు అందుబా టులోకి తీసుకురావాలని ఆయుష్ శాఖ రాష్ట్ర రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవి నాయక్ అన్నారు.ధన్వంతరి జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం నల్లగొండ ఆయుష్ శాఖ కార్యాలయంలో ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కార్యాలయ ఆవరణలోని హెర్బల్ గార్డెన్‌లో మొక్కలు నాటారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన వైద్య విధానమైన ఆయుర్వేదంతో పాటు యునాని, హోమియోపతి సేవలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుష్ వైద్య విధానాల ద్వారా అందే చికిత్సపై గ్రామీణ ప్రజల్లో నమ్మకం పెంచేలా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు.ఔషధ మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందిస్తున్న సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుహాసిని సోలోమోనిని ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో డాక్టర్ రుచిత,డీపీఎం కె.కళ్యాణ్,ఫార్మ సిస్టులు భుజంగరావు,విజయలక్ష్మి,మెర్సీ,యోగా ఇన్‌స్ట్ర క్టర్లు,ఆయుష్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కిసాన్ మహాసభల ఇంటింటి ప్రచారం

ప్రజాపక్షం/నకిరేకల్ : తెలంగాణ సాయుధ పోరాట పురిటి గడ్డ నల్లగొండ జిల్లాలో నవం బర్ 15 నుంచి 18 వరకు నిర్వ



హించనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల విజయవంతం కోసం చెర్వుఅన్నారంలో ఇంటింటి ప్రచారం నిర్వ హించి ఆర్థికంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపడుతున్న పోరాటా లను ప్రజలకువివరించారు. ఈ కార్యక్ర మంలో ప్రజాసంఘాల నాయకులు చిలు ముల రామస్వామి, పొన్న అంజయ్య,గంట వెంకన్న, గద్దపాటి సుధాకర్, నంద్యాల రామ్ రెడ్డి, దశరథ, రెడ్డిమల్ల భిక్షం, నంద్యాల అనంతరెడ్డి , దెందే బీరప్ప, పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక స్వామి కల్యాణం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: స్థానిక శ్రీ విఘ్నేశ్వర ఆల యంలో 51వ వార్షిక గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో శ్రీ సిద్ధి బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. మంగళ వారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో పవిత్ర పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి శాస్త్రో క్తంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, భారీ గజమాలలతో సుందరంగా అలంకరించారు. అనంతరం లోక కల్యాణార్థం భక్తుల సమక్షంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమం, మృత్యుం జయ హోమం, నవగ్రహ హోమాలను జరిపించారు.వేద పండితులు బ్రహ్మశ్రీ కొడవంటి ప్రవీణ్ శర్మ, బ్రహ్మశ్రీ దాము లూరు రవి శర్మల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారి కల్యాణ తంతును శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ తిరునగర్ శ్రవణ్, పద్మజ దంపతుల సమక్షంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవానికి పట్టణ నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆలయ అర్చకులు, భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలల ఫీజుల దోపిడీని అడ్డుకోవాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: కార్పొరేట్ జూనియర్ కళాశా లలు ప్రారంభమై కేవలం మూడు నెల లు మాత్రమే అవుతు న్నప్పటికీ విద్యార్థు లు, తల్లిదండ్రులపై



80 శాతం ఫీజులు వెంటనే చెల్లించాలని ఒ త్తిడి చేస్తూ వేధిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీ నర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఇంటర్మీడియట్ బోర్డ్ జాయింట్ సెక్రటరీ వసుంధర దేవిని కలిసి ఈ విషయమై వినతిపత్రం సమర్పించారు. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న జూని యర్ కళాశాలలను గుర్తించి వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. విద్యార్థుల విద్యా హక్కులను, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థి తులను దృష్టిలో ఉంచుకుని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో బీసీ జేఏసీ నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, తల్లిదండ్రులు, బాధి తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల్లో ఏఎంసీ కమిటీల ఏర్పాటు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఐసీడీఎస్ మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు పోషణ మాసం వేడుకలను ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం మన అంగన్‌వాడీ మన బాధ్యత అనే నినాదంతో చిల్లాపురం సెక్టార్ పరిధిలోని కొత్తకాలనీ, సామెగాని తండా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాస కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణ సులభతరం చేసేందుకు ఏఎంసీ కమిటీలను ఏర్పాటు చేశారు. ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, 3 నుండి 6 సంవత్సరాల పిల్లల తల్లుల భాగస్వామ్యంతో ఈ కమిటీలను నియమించారు.కార్యక్ర మంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన స్టాళ్ల ద్వారా వివిధ రకాల ఆహార పదార్థాల ప్రాముఖ్యతను ఐసీడీఎస్ సూపర్వై జర్ ఆర్.వాణి చైతన్యపరిచారు. ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాల అవసరాన్ని, దైనందిన జీవితంలో ఆహార వైవిధ్యాన్ని పాటించాల్సిన తీరును వివరించారు. ధాన్యాలు, చిరుధాన్యాలు వాడటం వల్ల శరీరానికి కలిగే శారీరక ఆరోగ్యం, రోగనిరోధక శక్తిని తెలియజేశారు. అనంతరం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ యాద్గార్‌పల్లి, ఉట్లపల్లి గ్రామాల్లోని గణేష్ మండపాల వద్ద ప్రజలకు పోషణ మాసం ప్రాముఖ్యతపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ ఆర్.వాణి, గ్రామపం చాయతీ కార్యదర్శి మల్లీశ్వరి,శారద, కోమల, సహాయకులు అచ్చాలి, సౌందర్య, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలి కలు, చిన్నారుల తల్లులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## యాద్గార్ పల్లిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలం యాద్గార్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలో నిరంతరం ఆటంకం లేని విద్యుత్ సరఫరాను అందించేందుకు చర్యలు వేగవంతం చేశారు. గ్రామంలో రూ.1.20 కోట్ల వ్యయంతో చేపడుతున్న త్రీఫేస్ విద్యుత్ లైన్, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులకు మంగళవారం గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు గాయం ఉపేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు గాయం ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జి.నరేందర్‌గౌడ్, వార్డు సభ్యులు కన్నెకంటి రామకృష్ణ, పొదిళ్ల బలరాం, సురేష్, బక్కయ్య, కారంపూడి రవి పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు

**ప్రజాపక్షం/నల్లగొండ :** గణేష్ నిమజ్జనం సందర్భంగా ఈ నెల 23న (బుధవారం) నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.రహదారులపై రద్దీ, ట్రాఫిక్ సమస్యలు, భారీగా విగ్రహాల నిమజ్జనం జరగనున్న దృష్ట్యా విద్యార్థుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ స్థానిక సెలవుకు బదులుగా రాబోయే సాధారణ సెలవు దినమైన వచ్చే నెల10న రెండవ శనివారం నాడు జిల్లాలోని అన్ని పాఠశాలలు,కళాశాలలు,ప్రైవేట్ విద్యాసంస్థలు సాధారణ పనిదినంగా పని చేస్తాయని తెలిపారు.ఉత్తర్వులను విద్యాశాఖ అధికారులు,విద్యాసంస్థల యాజమాన్యాలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

## చెంచల శ్రీనివాస్ మృతి పార్టీకి తీరనిలోటు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కౌన్సిలర్ చెంచల



శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన చెంచల శ్రీనివాస్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. పార్టీ కార్యకర్తగా, మాజీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, కౌన్సిలర్‌గా ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు, అభిమానులకు తీరనిలోటని విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మాదారంలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** వాతావరణ మార్పుల వల్ల జ్వరాలతో బాధపడుతున్న ప్రజలకు మెరు



గైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో మండల పరిధిలోని మాదారంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ మధ్య కాలంలో ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఈ నేపథ్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, వినోద లు బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో దోమల వ్యాప్తి చెందకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పారా త్రో బాల్ క్రీడాకారుడుకు లయన్స్ క్లబ్ స్టార్స్ ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** శ్రీలంకలోని నెగోంబోలో నవంబర్ 19 నుండి 23 వరకు జరగనున్న 2వ సౌత్ ఏషియన్ పారా త్రో బాల్ ఛాంపియన్‌షిప్‌కు భారత జట్టు తరపున ఎంపికైన నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన జూనియర్ అడ్వకేట్,అంతర్జాతీయ క్రీడాకారుడు కొడదాల బుచ్చి రాములుకు లయన్స్ క్లబ్ నల్గొండ స్టార్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన 5వ సౌత్ జోన్ పారా త్రో బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు సిల్వర్ మెడల్ సాధించడంలో బుచ్చి రాములు కీలక పాత్ర పోషించి భారత జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ స్టార్స్ ప్రతినిధులు మాట్లాడుతూ పరిమిత వనరులు, దివ్యాంగత్వాన్ని జయించి అంతర్జాతీయ స్థాయిలో దేశానికి, నల్లగొండ జిల్లాకు పేరు తెస్తున్న బుచ్చి రాములును అభినందించారు.



శ్రీలంక పర్యటన ఖర్చులకు చేయూతగా ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ స్టార్స్ అధ్యక్షుడు మారం వెంకట్ రమణా రెడ్డి,ప్రధాన కార్యదర్శి గుండ్ల అంజిరెడ్డి, కోశాధికారి జె.భాస్కర్ రెడ్డి, జోనల్ చైర్ పర్సన్ ప్రాగ్నుణ రెడ్డి, మాజీ గవర్నర్ యానాల ప్రభాకర్ రెడ్డి,సీనియర్ సభ్యులు కట్టా అనంత రెడ్డి,కీసరి శ్రీనివాస్ రెడ్డి,తుమ్మల వెంకట్ రెడ్డి,పోలేపల్లి శ్రీనివాస్, అలుగుబెల్లి ఆదిరెడ్డి, పాదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బెజ్జం సాయి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి సూచించారు.హైదరాబాద్‌లోని లకిడికాపూల్‌లోని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామ సర్పంచ్ బెజ్జం సాయిని నల్లగొండ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రం అందజేశారు.అలాగే జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చింతలపూడి భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చాట్ల చిరంజీవిలను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు.నూతనంగా నియమితు



లైన జిల్లా అధ్యక్షుడు బెజ్జం సాయి మాట్లాడుతూ తనను నియమించిన ఛాంబర్ అధ్యక్షుడికి,తనపై విశ్వాసం ఉంచిన జిల్లా సర్పంచులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.సర్పంచుల హక్కులు,సంక్షేమం,గ్రామాల అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.

## దేవత్ పల్లిలో సర్వే నంబర్ 111 భూములను పరిశీలించిన ఆర్‌డిఓ

**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలంలోని దేవత్ పల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 111లో ఉన్న భూమిని చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి,నాంపల్లి తహసీల్దార్ ఆంజనేయులు సర్వేయర్లతో కలిసి మంగళవారం పరిశీలించారు.లోకాయుక్తకు సంబంధించిన భూమి వివరాలు,హద్దులు, రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 111కు సంబంధించిన భూ వివరాలను, హద్దులను నిర్ధారించే ప్రక్రియను చేపట్టారు.సర్వేయర్లకు అవసరమైన వివరాలను సేకరించి రికార్డులతో క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చారు.అదేవిధంగా మండలంలోని తిరుమలగిరిలో గణనాథుని నిమజ్జనానికి ఊటకుంట



చెరువును అధికారులు పరిశీలించారు.శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది,సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయం ముందు పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం నిలిపివేయాలి

### ఉప సర్పంచ్ జోగు అరవిందరెడ్డి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం ముందు పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి, ప్రత్యామ్నాయ ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని, గ్రామాభివృద్ధి, భక్తుల సంక్షేమాన్ని కాపాడాలని ఉప సర్పంచ్ జోగు అరవింద్‌రెడ్డి వినతిపత్రం ద్వారా అధికారులను కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆలయ ముఖ ద్వారం ముందే పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి పునాదులు తీస్తున్నారని, దీనివల్ల భక్తులకు తీవ్ర ఇబ్బందులు, అసౌకర్యం కలగడమే కాకుండా పారిశుద్ధ్యలోపంఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి పబ్లిక్ టాయిలెట్లను తొలగించి వేరే ప్రదేశంలో నిర్మించాలన్నారు.

## ప్రతి ఏటా అంగరంగ వైభవంగా గణేష్ నవరాత్రులు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రతి ఏటా అంగరంగ వైభవంగా గణేష్ నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు కౌన్సిలర్ వల్దాస్ లక్ష్మి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో రెబల్ గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేష్ విగ్రహం వద్ద తొమ్మిది రోజులపాటు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అన్నప్రసాద వితరణ చేసేందుకు సహకరించిన దాతలకు, భక్తు



లకు, ఉత్సవ కమిటి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడమర్తి నాగరాజు, పిడమర్తి మహేందర్, పాతకొట్టు రాజేష్ పాల్గొన్నారు.

## పరీక్షలో విద్యార్థులు ప్రతిభ చాటాలి...

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** గో సేవా తెలంగాణ వారి ఆధ్వర్యంలో నిర్వహించే గో విజ్ఞాన్ పరీక్ష 2026లో విద్యార్థులు ప్రతిభ చాటాలని కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయుడు మల్లేల జనార్ధన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మన హిందూ సాంప్రదాయానికి ప్రతిక అయినగో విద్యార్థులు అవగా



హన పెంచుకొని రాష్ట్ర స్థాయిలో పరీక్షలో ప్రతిభ చాటాలని అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆయుర్వేదం మన పూర్వీకులు అందించిన గొప్ప వరం

**ప్రజాపక్షం/మునగాల:** ఆయుర్వేదం మన పూర్వీకులు అందించిన గొప్పవరమని ఆయుర్వేద వైద్యాధికారిణి దుర్మిల అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం



గ్రామంలోని జడ్పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయుర్వేదంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేదంతోనే రేపటి ఆరోగ్యం కోసం మెరుగుపర్చుకోవాలని అన్నారు. రోజువారి జీవనశైలిలో యోగ సరైన ఆహారపు అలవాట్లతో వ్యాధులను దూరం చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దీపాదేవి, ఆయుర్వేద ఫార్మసిస్ట్ శ్రీదేవి, యోగా ఉపాధ్యాయులు సిహెచ్ భవాని, ధన్‌వీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జెడ్‌పి హెచ్‌ఎస్‌లో ఘనంగా ఏక్ పేడ్ మాకే నామ్

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని జెడ్పిహెచ్‌ఎస్ పాఠశాలలో మంగళవారం పర్యావరణ పరిరక్షణతో పాటు కన్న తల్లిని గౌరవించుకునేలా కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన ఏక్ పేడ్ మాకే నామ్ (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమ



ంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పాఠశాల హెడ్మాస్టర్ చంద్రకళ మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు బాధ్యత వహించాలని, కన్న తల్లి జ్ఞాపకార్థం లేదా తల్లిపై ఉన్న గౌరవంతో ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ సిఆర్‌పి లింగయ్య, సైన్స్ టీచర్ భాగ్యలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గణేష్ నిమజ్జనోత్సవాన్ని భక్తులు, ఉత్సవ కమిటిలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూర్యాపేట పట్టణ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్ అన్నారు.



గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం 9వ వార్డులో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ బుధవారం నిర్వహించే నిమజ్జనోత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటిలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విఘ్నాధిపతి గణేషుడి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులు, బిఆర్‌ఎస్ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

**ప్రజాపక్షం/వేములపల్లి :** మండలంలోని సల్కునూరు,రావులపెంట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా



సూపర్‌వైజర్ పరిమి రజిని మాట్లాడుతూ బాలింతలు,గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు.తల్లి,బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం ఎంతో అవసరమని తెలిపారు.రఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు జి.సైదిరెడ్డి,అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి,సుజాత,శారద,ఆశా కార్యకర్తలు,గర్భిణీలు,బాలింతలు పాల్గొన్నారు.

## జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చింతలపూడి భాస్కర్‌రెడ్డి



**ప్రజాపక్షం/డిండి:** తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆ ధ్వర్యంలో మంగళవారం జరిగిన నల్గొండ జిల్లా సర్పంచ్‌ల స ంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుండ్లపల్లి(డిండి) మండలం శా ంతిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ చింతలపూడి భాస్కర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ మేరకు ఎన్నికకు సంబంధించిన నియామక పత్రాన్ని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు చింతపు సత్యనారాయణరెడ్డి చేతుల మీదుగా స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన చింతలపూడి భాస్కర్‌రెడ్డిమాట్లాడుతూ నాకు అప్పజెప్పిన బాద్యతలను, సర్పంచ్‌ల హక్కుల కోసం, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. తన ఎ న్నికకు సహకరించిన పంచాయతీరాజ్ ఛాంబర్ సభ్యులకు, దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్, జిల్లా సర్పంచ్‌లకు, ఈ స్థాయికి తీసుకొచ్చిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## చిట్టంపహాడ్‌లో ఘనంగా అన్నదానం

**ప్రజాపక్షం/నాంపల్లి :**మండలంలోని చిట్టంపహాడ్ గ్రామం బృందావనం కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.స్థానిక సర్పంచ్ కోరె దేవేందర్ సైదులు,ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వెలసిన వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నాంపల్లి సీఐ దూది రాజు, ఎస్ఐ కే.లింగారెడ్డి లు గణనాథుడికి ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించారు.అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు, గ్రామస్థులకు మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గిరి స్వామి, బల్లెం వెంకటేష్, వార్డు సభ్యులు ఏకుల శ్రీయాల,వెంకట్ రాములు, ఉగ్గపల్లి రాణి యాదయ్య,గజ్జల ధనంజన్ రెడ్డి, గ్రామ యువకులు, మహిళలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**నేరేడుగొమ్ము:**నేరేడుగొమ్ము మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గణనాథునికి ఆర్ఎస్ఎస్ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అల్పాహారాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విఘ్నాలు తొలగించి విజయాలను అందించే దైవంగా వినాయకుడిని హిందూ సమాజం భక్తి శ్రద్ధలతో కొలుచుకుంటుందని, దైవ పూజలు, ధార్మిక క్రతువులను విఘ్నేశ్వరుని పూజతో ప్రారంభించడం ద్వారా హిందూ సంప్రదాయాల్లో గణనాధునికి తొలి ప్రాధాన్యతను ఇస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రవి, సన్నీ, వెంకట్, వెంకన్న, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నాగయ్య, శంకర్, రామకృష్ణ, బ్రహ్మచారి, రామచారి, యాదగిరి, నరసింహా, మల్లయ్య, నగేష్, భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన కార్యదర్శిగా చాట్ల చిరంజీవి

**ప్రజాపక్షం/చందంపేట:** తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నల్గొండ జిల్లా సర్పంచ్‌ల సంఘం ప్రధా న కార్యదర్శిగా చందంపేట మండలం చిత్రియాల గ్రామ పంచాయతీ సర్పంచ్ చాట్ల చిరంజీవి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయన నియామక పత్రాన్ని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు చింపుల సత్యనారాయణరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం చాట్ల చిరంజీవి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తూ, సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రతినిధులకు, డా. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రమావత్ రవీంద్రకుమార్, జిల్లా సర్పంచులకు, చిత్రియాల గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# సోమ్లానాయక్ మృతికి ఎమ్మెల్యే సంతాపం

### దస్రు నాయక్ కుటుంబానికి అండ భరోసా



**ప్రజాపక్షం/చందంపేట:** చందంపేట మండలం అచ్చంపేట పట్టి గ్రామ పంచాయతీ పరిధిలోని సంధ్య తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి జర్పుల భద్యనాయక్ తండ్రి, మాజీ వార్డు సభ్యులు సోమ్లానాయక్ మృతి బాధాకరం అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం ఎంఎల్‌ఏ బాలునాయక్ సోమ్లానాయక్ పార్థివ దేహానికి పూలమాల మాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం బుడ్డోని తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన నేనావత్ దస్సునాయక్ కుటుంబాన్ని ఎంఎల్‌ఏ బాలునాయక్ పరామర్శించి, కుటుంబ సభ్యులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకొని దస్రు నాయక్ కుటుంబానికి ప్రభుత్వం నుండి తక్షణ సహాయం అందేలా విద్యుత్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంఎల్‌ఏ వెంట మల్లారెడ్డి, వెంకటయ్య, గోవింద్, హరికృష్ణ, బిక్కునాయక్, సాధిక్, అనంతగిరి, లచ్చిరాం, మహాలక్ష్మయ్య, మున్నయ్య, ఉమామహేశ్వర్, వంశీ, కరీమొద్దీన్, రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీరాంపురం ప్రాథమిక పాఠశాలకు సిసి కెమెరాలు అందజేత



**ప్రజాపక్షం/తిరుమలగిరిసాగర్ :**మండల పరిధిలోని శ్రీరాంపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.పాఠశాల అభివృద్ధిలో భాగంగా దాత,వజ్ర తేజ రైస్ ఇండస్ట్రీ డైరెక్టర్ చిట్టిప్రోలు వెంకటేశ్వర్లు సహకారంతో పాఠశాలకు నాలుగు సీసీ కెమెరాలు, ఉచిత ఇంటర్నెట్ సదుపాయాన్ని అందజేశారు.ఈ కెమెరాల ద్వారా పాఠశాల ఆవరణ,తరగతి గదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వీలు కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఫరీద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. పాఠశాల అవసరాలను గుర్తించి సీసీ కెమెరాలు,ఇంటర్నెట్ సౌకర్యం కల్పించిన దాత చిట్టిప్రోలు వెంకటేశ్వర్లుకు పాఠశాల తరపున, విద్యార్థుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈసదుపాయంతో విద్యార్థులకు భద్రతతో పాటు డిజిటల్ విద్యను అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలు

### చండూరు మండల అభివృద్ధి ,సామర్థ్య వృద్ధిపై సమీక్షా సమావేశం

### సమావేశానికి ముక్య అతిధిగా హాజరైన జిల్లా గ్రామాణాభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి



**ప్రజాపక్షం /చండూరు :** చండూరు మండల అభివృద్ధి ,సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలోని సమావేశమందిరంలో మండల సమీక్షా సమావేశం మండల ప్రత్యేక అధికారి కే.నాగమల్లేశర రావు అధ్యక్షతన, ఎంపిడిఓ బండారు యాదగిరి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లాగ్రామీణ అభివృద్ధి అధికారి వై.శేఖర్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామాల అభివృద్ధికి తీసుకొవల్సిన చర్యలు ,ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామాణాబివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్ధవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, జలసిరి ,ఇంకుడు గుంతలు, విబి జీ రాం జీలో ఉన్న 318 పనుల చేయుటు గురించి వివరించారు. నూతన చేయూత పెన్షన్లు ,మహిళా సంఘాలు పనితీరుపై సమీక్షించారు. మండలంలో మొత్తం 19 గ్రామపంచాయితీలు ఉండగా అందులో 12 గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు మాత్రమే సమావేశానికి హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బంగారు యాదగిరి , తహసీల్దార్ రమాకాంత్ శర్మ, ఎంపిఓ కోటయ్య, సర్పంచ్‌లు బోయపల్లి రాజేష్, ముక్కాంల వెంకన్న యాదవ్, గాలెంక రాంబాబు , లేదన్న సత్యం, దామెర రాములు, జాల వెంకన్న ,ఏపిఎం శ్రీను, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతి వద్ద ఘనంగా అన్నప్రసాద వితరణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** శ్రీ వేదవ్యాస గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 47వ డివిజన్ మున్సిపల్ క్వార్టర్స్ బోయవాడలో కొలువుదీరిన మట్టి గణపతి వద్ద మంగళవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని డివిజన్ కార్పొరేటర్ అబ్బగోని కవిత రమేష్ గౌడ్ సహకారంతో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి కాలనీవాసులు, పట్టణంలోని వివిధ ప్రాంతాల ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం మహాదానం ఆకలి తీర్చే సేవా అనే సందేశంతో భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేయడం జరిగిందని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో అన్నప్రసాద వితరణ దాత అబ్బగోని కవిత రమేష్,వేదవ్యాస గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు మునాస నాగరాజు,మునాస ప్రసన్న కుమార్,చెన్నూరు భరద్వాజ, మునాస వినయ్,సత్యనారాయణ,కొప్పు అరుణ్, వేణు, కోటి, యోగి,పెద్ది సాయికృష్ణ, సుష్మా కోటేశ్వరరావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు పుట్టినరోజు వేడుకలు

**ప్రజపక్షం/భూదాన్ పోచంపల్లి:**భూదాన పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు పుట్టటిన రోజు వేడుకలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం హాజరయ్యి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ కౌన్సిలర్స్ పట్టణ మండల పార్టీ ఆధ్వర్యంలో చౌరస్తా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకతీతంగా సంబరాలు జరుపుకున్నారు. పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం: ఎస్ఐ

**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము:** నేరేడుగొమ్ము మండలంలో బుధవారం నిర్వహించే గణేష్ నిమజ్జనాన్ని గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు, ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నేరేడుగొమ్ము ఎస్ఐ నాగేంద్రబాబు సూచించారు. గణేష్ నిమజ్జనంలో డిజేలకు ఎలాంటి అనుమతులు లేవని, నిబంధనలు ఉల్లంఘించి డిజేలను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## గణనాథునికి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము:**నేరేడుగొమ్ము మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో కొలువుదీరిన గణనాథున్ని మంగళవారం బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈసందర్భంగా గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు వడ్త్య రమేష్‌నాయక్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు తిరుపతన్న, పుల్‌సింగ్, నరసింహా, కృష్ణయ్య, గన్నయ్య, యాదగిరి, ఇద్దయ్య, కోటయ్య, వార్డు సభ్యులు ఇద్దయ్య, కృష్ణ, అంజి, రమేష్, అనిల్, వినోద్, ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## డిండి ప్రాజెక్టులో నిమజ్జనం

**ప్రజాపక్షం/డిండి:** డిండి ప్రాజెక్టులో నిమజ్జన కార్యక్రమం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సురక్షితమైన, ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జనం జరిగేలా గ్రామ ప్రంచాయతీ పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధతో చేసిన ఏర్పాట్లను దేవరకొండ డిఎల్‌పివో శంకర్‌నాయక్, డిండి ఎస్ఐ బాలకృష్ణలు పరిశీలించారు. నిమజ్జన ప్రదేశంలో పారిశుద్ద్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, భద్రతా చర్యలు, రాకపోకల సౌకర్యాలు తదితర అంశాలు పరిశీలిస్తూ, అవసరమైన చర్యలను వెంటనే చేపట్టేలా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిండి సర్పంచ్ నల్లగంతుల రవి, సెక్రటరీ జంగయ్య, ఉప సర్పంచ్ కౌసర్ రషీద్, వార్డు సభ్యులు బాలయ్య, సురేష్, సైదులు, ఫిషరీస్ ఫీల్డ్ మెన్ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనంలో డిజెలకు అనుమతి లేదు

### సిఐ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ :** గణేష్ నిమజ్జనం సందర్భంగా పట్టణంలో నిర్వహించే ఊరేగింపులకు డిజేలకు అనుమతి లేదని నిర్వాహకులు ప్రజలకు పోలీసులకు సహకరించాలని దేవరకొండ సిఐ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిబంధనలను ఉల్లంఘించి డిజేలు ఏర్పాటు చేస్తే వాటిని సిజ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చట్టాన్ని ఎవరు కూడా ఉల్లంఘించకూడదని ప్రజలు పోలీసులకు సహకరించి, నిబంధనలను పాటించాలని సూచించారు.

# రైతుల సంక్షేమమే ధ్యేయం



ప్రజాపక్షం/చౌటుప్పల్: అమరవీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు,బూర్గు కృష్ణారెడ్డిలు అన్నారు.మండలంలోని పంతంగి గ్రామంలో కామ్రేడ్ బోయ బాలనర్సింహ్మా ప్రథమ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు చేసిన వ్యక్తి బాలనర్సింహ్మా అని అన్నారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం పని చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చీరిక సంజీవరెడ్డి,అంతటి అశోక్, రోడ్డ భగత్‌సింగ్, పేరియర్ రాజు, నేరడి మహేష్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

# పాపిరెడ్డి మృతికి కాంగ్రెస్ నాయకుల సంతాపం



ప్రజాపక్షం/రామన్నపేట : మండలంలోని నిదానపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాం గ్రెస్ పార్టీ నాయకులు గుత్తా నర్సిరెడ్డి మేనమామ పోలు పాపిరెడ్డి అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామన్నపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్ మోహన్ పాపి రెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బిక్షం రెడ్డి,నాయకులు, జినుకల ప్రభాకర్,గంగుల వెంకటరాజి రెడ్డి, రామిని రమేష్,ఎం.డి అక్రమ్, గొలుసుల ప్రసాద్ పాల్గొన్నారు.

# పోషకాహార అవగాహనా సదస్సు



ప్రజాపక్షం/రామన్నపేట : మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామ అంగన్వాడీ కేంద్రాలలో పోషకాహార మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహనా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెక్టార్ సూపర్‌వైజర్ జి.ధనమ్మ,గ్రామ సర్పంచ్ పులిపలుపుల సునీత,ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు నజీబ్,హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్,వి.ఓ.వరలక్ష్మి విచ్చేశారు. గర్భిణీలు,బాలింతలు పిల్లల ఎత్తుకు తగిన బరువు, బరువుకు తగిన ఎత్తు పెరిగేలా సరైన పోషకాహార పద్ధతులను పాటించాలని సూచించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పవిత్ర వాణి,కౌసల్య,చంద్రకళ, అనిత, కావ్య, బాలింతలు, గర్భిణీలు, అమ్మమ్మలు,కిశోర బాలికలు పాల్గొని తమ విలువైన సలహాలను అందజేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమమే ధ్యేయం

**ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్**



ప్రజాపక్షం/రామన్నపేట : తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం,వారికి సముచిత న్యాయం జరిగేలా పోరాటాన్ని ఉధృతం చేసేందుకు ఉద్యమకారుల ఫోరం సిద్ధమైంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 27న తలపెట్టిన 'చలో యాదగిరిగుట్ట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి,ప్రాణాలర్పించిన ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికీ 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని,అర్హులైన ఉద్యమకారులందరికీ ప్రతి నెలా రూ.25,000 పింఛన్ అందజేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, తెలంగాణ సాధనలో అంకితభావంతో పోరాడిన ఉద్యమకారుల హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ'చలో యాదగిరిగుట్ట'కార్యక్రమానికి ఉద్యమకారులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు ఎస్కే చాంద్,బందెల రాములు, రెబ్బాసు రాములు, బోయ సైదులు, కైరంకొండ సంతోష్ కుమార్,డాక్టర్ నకిరేకంటి అశోక్,డాక్టర్ కొండ మల్లేష్ గౌడ్,మండడి రవీందర్ రెడ్డి, మద్దేగాల నర్సింహ, జెట్టి శివ ప్రసాద్,ఆవుల లక్ష్మీ నారాయణ,గర్దాస్ కరుణాకర్,రాస వెంకటేశం, లెంకల సత్యం, ఆళ్ల హరికృష్ణ పాల్గొన్నారు.

# సమతుల్య ఆహారంతో ఆరోగ్యవంతమైన సమాజం



ప్రజాపక్షం/వలిగొండ : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే రక్తహీనతను నివారించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఐసిడిఎస్ వలిగొండ సెక్టర్ సూపర్వైజర్ పారిజాత, వలిగొండ అంగన్వాడి టీచర్ బాలవిజయ అన్నారు. పోషణ మాసం ఉత్సవాల్లో భాగంగా వలిగొండ మండల కేంద్రంలోని అంగన్వాడీ 2 కేంద్రంలో మంగళవారం పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, మొలకెత్తిన గింజలు, గుడ్లతో ప్రత్యేక ఆహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలు మంచి పోషక విలువలు ఉండే సమతుల ఆహారం ప్రతిరోజు తీసుకోవాలని, సమతుల ఆహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి, పిల్లల ఎదుగుదల గురించి, వారి మేధో వికాసం గురించి వివరించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశుభ్రత పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా అనేక రోగాలను దూరం పెట్టవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

# నిత్యవసరాల ధరల పెరుగుదల వల్ల ప్రజలపై భారం

**ఎన్ఎఫ్ఐడబ్ల్యూ బండి జంగమ్మ**



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల పేద ప్రజల పెనుభారం పడుతుందని ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ అన్నారు. మంగళవారం రోజున సిపిఐ కార్యాలయం వద్ద ఆరే పుష్ప అధ్యక్షతన ఎన్ఎఫ్ఐడబ్ల్యు తెలంగాణ రాష్ట్రం మహిళా సమైక్య మున్సిపల్ శాఖ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, ప్రతినిత్యం నిత్యవసర వస్తువులు ఆకాశాన్ని అంటుతున్నాయని, పేద సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితులకు ధరలు పెరుగుతున్నాయని అన్నారు. ధరలు నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రజల అవసరాల కన్నా, వ్యక్తుల అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజల ఇబ్బందులు బాధలను పట్టించుకోవడంలేదని అన్నారు. ఒకవైపు నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతుంటే మరొకవైపు దేశ వ్యాప్తంగా గంజాయి, కొకేన్, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వాడకాలు పెరిగిపోయాయని, యువకుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని అన్నారు. రాష్ట్రంలో, దేశంలో మహిళలపై అత్యాచారాలు దాడులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టలేక పోతున్నాయని మహిళల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వాలు పాటుపడతలేదని వారి విమర్శించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షురాలు మోనుకుంట్ల నరసమ్మ, మద్దూరు భాగ్యమ్మ, రావుల విజయలక్ష్మి , ములకలపల్లి సరిత, సుంకర వీరమని, గుజ్జ శశిరేఖ, రేణుక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రాష్ట్రవ్యాప్త ధర్నా

**ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి**



ప్రజాపక్షం/రామన్నపేట : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు)జాతీయ కౌన్సిల్ నిర్ణయం మేరకు న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించిన ప్రధాన డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 23న తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కోర్టు కాంప్లెక్స్ ముందు నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు.రామన్నపేటలో మంగళవారం జరిగిన ఐలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఆగస్టు 15,16 తేదీల్లో కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలో జరిగిన ఐలు జాతీయ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఈ రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ ప్రధానంగా మూడు డిమాండ్లను ఆయన ప్రస్తావించారు.కేంద్ర న్యాయవాదుల సంక్షేమ నిధి చట్టం2001ను సవరించి, న్యాయవాదుల మరణం లేదా పదవీ విరమణ సందర్భంలో రూ.25 లక్షలు అందించాలి.న్యాయవాదులకు వైద్య సహాయంగా రూ.5 లక్షలు అందించాలి.జూనియర్ న్యాయవాదులకు కనీసం ఐదు సంవత్సరాలపాటు నెలకు రూ.10,000 స్టైపెండ్ మంజూరు చేయాలి. ఈ డిమాండ్ల సాధన కోసం జరిగే ధర్నాలో న్యాయవాదులు ఐక్యంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మామిడి వెంకట్ రెడ్డి కోరారు. ఈ సమావేశానికి ఐలు జిల్లా ఉపాధ్యక్షులు పాల్వంచ జగతయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యాదాసు యాదయ్య,గద్దం నరసయ్య,అంకం నరేష్,కిరణ్ కుమార్,జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దివిస్ పరిశ్రమ సేవలు అభినందనీయం



ప్రజాపక్షం/చౌటుప్పల్: చౌటుప్పల్ మండలం పిపల్‌పహాడ్,ఎనగంటితండా గ్రామాల్లో దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఉచితంగా వైద్యశిబిరం నిర్వహించారు.ఆయా గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి,అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అదే విధంగా పాఠశాల విద్యార్థులకు అవసరమైన రూ.1,68,356 విలువైన నోట్‌బుక్స్‌ను ఉచితంగా ఇచ్చారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నాగేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దివిస్ పరిశ్రమ సేవలు అభినందనీయమని అన్నారు.విద్యార్థులకు దాతలు చేసే సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదువుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జయంత్‌కుమార్,డాక్టర్ నరేష్,ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్,ప్రధానోపాధ్యాయురాలు శోభ,గీతరాణి,అఖిల,దివిస్ ప్రతినిధులు బి.గోపి,జి.వెంకటేశ్వర్లు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి : చెక్క వెంకటేష్



ప్రజాపక్షం/ఆత్మకూర్ (ఎం) : తెలంగాణ ప్రజానాట్య మండలి యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం రాఘవాపురం గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ కోలాట బృందం కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం వచ్చి 12 సంవత్సరాలు దాటుతున్న ఇప్పటికే గ్రామీణ ప్రాంత కళాకారులకు కవులకు అన్ని రంగాల కళాకారులకు ఆదుకోలేక రాష్ట్ర ప్రభుత్వాలు పోతున్నాయి ఇప్పటికైనా గ్రామీణ కళాకారులను ఆదుకొని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి యాదగిరిగుట్టపై జరిగే బ్రహ్మోత్సవాలకు అవకాశం కల్పించాలని కళాకారులకు బ్యాంకులలో రుణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోలాట కళాకారులు కొంపల్లి పుష్ప, బాకీ నరసమ్మ, మచ్చ కృష్ణవేణి, కూరెల్ల సబిత, మచ్చ పద్మ, కూరేళ్ల వినోద, మచ్చ సరిత, కూరెల్ల మల్లమ్మ, మచ్చ సునీత, మచ్చ విజయ, తుమ్మలగూడెం అండాలు, తుమ్మల గూడెం సంధ్య, కూరెళ్ల సావిత్రి, తుమ్మల గూడెం మమత, మచ్చ సంధ్య తదితరులు ఉన్నారు.

# వంట సహాయకురాలి పోస్ట్‌కి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాపక్షం/ఆత్మకూర్(యం): మండల కేంద్రంలోని కె.జి.బి.వి.పాఠశాల ఆత్మకూర్ యం నందు ఖాళీగా ఉన్న (నాన్ టీచింగ్) వంట సహాయకురాలు పోస్ట్01కు తాత్కాలిక పద్ధతిన నియమించుటకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి పి.వెంకట్రామిరెడ్డి తెలిపారు. అర్హతలు 7వ తరగతి ఉత్తీర్ణత, వయసు:18 సం.నుండి 45 వరకు, వేతనం : 9,750/ దరఖాస్తు చివరి తేదీ: 28.09.2026. సాయంత్రం 5:00 గం.ల వరకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను కేజీబీవీ పాఠశాల ఆత్మకూర్ యం నందు యస్‌ఓకు అందజేయాలని తెలిపారు.

# ఆర్‌విఎం హాస్పిటల్ బాలవికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



ప్రజాపక్షం/తుర్కపల్లి : మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో ఆర్ వి ఎం హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు .ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దొరికిన రేణుక వెంకటేశ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజీషియన్, హార్ట్ స్పెషలిస్ట్, యూరాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ స్పెషలిస్టులు, రోగులను పరీక్షించి మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నూకల శ్రీను, పిఏసిఎస్ డైరెక్టర్ రంగ నారాయణరెడ్డి, వార్డు సభ్యులు చాడ కరుణాకర్ రెడ్డి, యూత్ సభ్యులు సాయి చారి, బాలవికాస విలేజ్ డెవలప్మెంట్ ఏజెంట్ కీసర కృష్ణ, రేషన్ డీలర్ నాగరాజు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తుర్కపల్లిలో అన్నప్రసాద వితరణ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీ గ్రంథాలయం వద్ద నెలకొల్పిన గణపతి మండపం వద్ద మంగళవారం



రోజున గ్రామ సర్పంచ్ సోమల వెంకటేష్ ఆధ్వర్యంలో భక్తులు, గ్రామప్రజలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, భక్తి కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అదృష్టమన్నారు.ఈ కార్యక్రమంలో కొక్కొండ లక్ష్మీ నారాయణ,తరుణి శ్రీహరి, ఆకుల రమేష్,సైదులు,జంగిటి శ్రీనివాస్, కూరేళ్ల బాలక్రిష్ణ, ఆదిమూలం సురేష్,ఆకుల నవీన్,శివ, సాయి రెడ్డి, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

## ఘనంగా పోషణ మాసం

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** పోషణ్ అభియాన్ పోషణ మాసం సందర్భంగా ఎంపీడీవో ఆఫీస్‌లో మండల లెవెల్ ప్రోగ్రాం మంగళవారం రోజున నిర్వ



హించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసంతో పాటు తల్లులకు పోషకాహారం పై అవగాహన తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆహారం ఆరోగ్యం విషయంలో సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాధా, ఎంపీడీవో శ్యామల, సిడిపిఓ శైలజ, సూపర్వైజర్స్ పుష్ప, లలిత, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అద్దమడుగు రాజేష్ పైలెట్, బొమ్మలరామారం గ్రామ సర్పంచ్ కట్ట ఉమాదేవి శ్రీకాంత్ గౌడ్, ఉపసర్పంచ్ జంగయ్య వార్డు సభ్యులు బాల్ నరసింహ, నవీన్ మండలంలోని అంగన్వాడీ టీచర్స్ గర్భిణీలు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు,ఇప్పటివరకు రాష్ట్రంలోని ఏ డిగ్రీ కళాశాలలోనూ సీటు పొందని విద్యార్థుల కోసం కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సెప్టెంబర్ 24,25 తేదీలలో ఇంతవరకు రాష్ట్రంలో ఏ డిగ్రీ కళాశాలలోనూ అడ్మిషన్ పొందని విద్యార్థులు అందరూ దీనికి అర్హులని,అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు హాజరు కావాలని విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నేరుగా కళాశాలలో ప్రవేశాలు పొందాలని ప్రధానాచార్యులు కోరారు.

## దుప్పెల్లి బిఅర్ఎస్ పార్టీ గ్రామశాఖ ఎన్నిక

**ప్రజాపక్షం /ఆత్మకూర్ (యం):** దుప్పెల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామశాఖ సమావేశం నిర్వహించి గ్రామకమిటి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు చందర్ గౌడ్ మాట్లాడుతూ దుప్పెల్లి గ్రామంలో పార్టీ బలోపేతానికి నూతన గ్రామశాఖ కృషి చేయాలని,కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనీ,రైతులకు అండగా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.నూతనంగా గ్రామశాఖ అధ్యక్షాకార్యదర్శులుగా పల్సం నర్సయ్య,నీల చిన్న ముత్తయ్య,కట్టెల నర్సయ్య మండల నాయకులు కావటి నర్సింహా,కన్నెబోయిన శంకరయ్య,ఎర్ర స్వామి,ఎలుగు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# హరీష్‌రావుపై విమర్శలు చేస్తే ఊరుకోం

### బిఆర్ఎస్ నేతల హెచ్చరిక
### అభివృద్ధిపై బహిరంగ చర్చకు సవాల్



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి హరీశ్రావు, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్రెడ్డి నాయకత్వంలో ఆలేరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, హరీష్ రావు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి లపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ పార్టీ ఓటకొండూర్ మండల ఆధ్యక్షుడు బోట్ల యాదయ్య అన్నారు. ఆయన మంగళవారం మోటకొండూర్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోట్ల యాదయ్య, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కర్రె వెంకయ్య మాట్లాడుతూ ఇటీవల హరీశ్రావు హాజరైన బీఆర్ఎస్ సమావేశానికి వచ్చిన ప్రజా స్పందన, కాంగ్రెస్ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్లో చేరిన తీరు చూసి కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు గురవుతున్నారని విమర్శించారు. మోటకొండూర్ మండల ఏర్పాటు, ఎంఆర్ఓ, ఎండీఓ కార్యాలయాలతోపాటు వివిధ ప్రభుత్వ భవనాల మంజూరులో మాజీ ఎమ్మెల్యే సునీత మహేందర్రెడ్డి కృషి ఉందన్నారు. ప్రస్తుత ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు స్వార్థ ప్రయోజనాల కోసం భూకబ్జాలు, మట్టి, ఇసుక దందాలకు పాల్పడుతున్నారంటూ వెంకయ్య ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను పరిశీలించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై జీవోలతో సహా సైదాపురంలో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అక్రమాలకు పాల్పడితే రానున్న రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు భైరోజు వెంకటాచారి, మాజీ జెడ్పిటిసి తోటకూరి అనురాధ బీరయ్య, మాజీ మార్కెట్ కమిటీ ఎగిడి కృష్ణ, బురాన్, ఎర్ర మల్లేష్, భూమండ్ల యాదయ్య, బాల్ద లింగం, బుగ్గ నాగరాజు, బోట్ల మహేష్, ఏకు చంద్రారెడ్డి, గాజుల దామోదర్, మల్గ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## జూలూరు పిఎసిఎస్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు

### స్వీకరించిన కళ్ళెం రాఘవరెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్‌పోచంపల్లి:** పోచంపల్లి మండలం జూలూరు పిఎసిఎస్ చైర్మన్ గా కళ్ళెం రాఘవరెడ్డి సోమవారం పదవి ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు.తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసిన నేపథ్యంలో డిసివో నాగార్జున నాన్ అఫీషియల్ సహకార సంఘం పాలక వర్గంచే అధికారికంగా ప్రమాణం స్వీకారం చేయించారు.వైస్ చైర్మన్ గా మక్తాల రమేష్ గౌడ్ నాన్ అఫీషియల్ మెంబర్స్ గా కొత్తపల్లి శ్రీశైలం బొచ్చు యాదమ్మ సందని కిషన్ వట్టిపల్లి జంగయ్య పక్కీరు మల్లారెడ్డి అందేల ఆండాలు జడల అంజయ్య పల్ల విష్ణు వర్ధన్ రెడ్డిబొబ్బల సుభాష్ రెడ్డి దుర్గం శ్రీశైలం రమావత్ కిషన్ లు పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ మేరకు పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు నూతన పాలక వర్గానికి ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ సురేష్ మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు సర్పంచ్ కాసుల అంజయ్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ అంబరీష్ రెడ్డి గోరంటి శ్రీనివాస్ రెడ్డి బాల్ రెడ్డి బారత లవకుమార్ లు అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఝుఆదాయం పైన ఉన్న శ్రద్ధ భక్తుల ప్రాణాల పైన లేదా...?

### వాహనాలకు 500 రూపాయలు వసూలు
### కొండపైన పార్కింగ్ నియమాల పాటింపు లేదు
### వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం కొండపైన దేవాలయ అధికారులు ఆదాయం పెరుగుదలపై చూపించిన శ్రద్ధ భక్తుల వసతులు, సౌకర్యాలు ప్రాణాల పైన చూపించడం లేదని సిపిఐ మున్సిపల్ శాఖ కార్యదర్శి 12వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం రోజున కొండపైన వికలాంగురాలయిన యాచకురాలు ఈశ్వరమ్మ కారు ప్రమాదంతో కొండపైన అక్కడికక్కడే మరణించడం బాధాకరమన్నారు. తనను ఒక యాచకురాలుగా కాకుండా ఒక భక్తురాలుగా చూడవలసిన అవసరం ఉందని, నిత్యం దేవస్థానం ఆదాయం పెంచాలని శ్రద్ధ ఉన్న దేవాలయం అధికారులకు భక్తుల సౌకర్యాలు కల్పించడం పట్ల, ప్రాణాల పైన లేదని దాని నిర్లక్ష్యం వల్లనే ఈరోజు ప్రాణ నష్టం జరిగిందని అన్నారు. కొండ కింది నుండి కొండపైకి కారు పోవడానికి 500 రూపాయలు వసూలు చేస్తున్న పోలీస్ సిబ్బంది కొండపైన పార్కింగ్ నియమాలను ఎందుకు పాటించడం లేదని అన్నారు. కొండపైన కారులు పార్కింగ్ చేసే సరైన స్థలం లేదు.ఎలాంటి నియమాలు, పార్కింగ్ బార్డర్ ,పార్కింగ్ భద్రత సరిగ్గా లేదన్నారు. కొండపైన చాలా దొంగతనాలు కూడా జరుగుతున్నాయని వీటన్నిటి పైన సరైన సమీక్ష జరిపి చూసుకోవాల్సిన బాధ్యత అధికారుల పైన ఉందని అన్నారు.

## ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలి



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ప్రభుత్వం మంజూరు చేస్తున్న వివిధ పథకాలపై పొదుపు సంఘాల సభ్యులు అవగాహన పెంచుకోవాలని ఐబిసి ఆర్పి రూబీనా, నాచారం అన్నారు. మంగళవారం మండలంలోని లింగాల గ్రామంలో పొదుపు సంఘాలు నడుపుకునే విధానంపై ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న వివిధ పథకాలపై సలహాలు సూచనలు చేశారు. మండలంలో 15 రోజుల పాటు వివిధ గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గార్లపాటి స్వర్ణ శ్రీనివాస రెడ్డి, ఏపిఎం దాసరి అంజయ్య, సిసి బానోతు వెంకన్న, సంఘబంధాల అధ్యక్షురాలు ఏసు రాజు ఉపేంద్ర, వివిధ సంఘాల పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :**అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి వైద్య చికిత్స నిమిత్తం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి వారి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం ఆయన నివాసంలో సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన శివరాత్రి దశరథ మనవడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం అందజేసి వారికి ధైర్యంగా ఉండాలని సూచించారు.

## రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** జాతీయ రహదారి వెంట స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హైవే డిఈ రామారావు హెచ్చరించారు. అర్వపల్లిలో రోడ్డు మీదకు నిర్మాణాలు చేస్తున్న యజమానులకు నోటీసులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హైవే ఏఈ రాంకుమార్, పంచాయితీ కార్యదర్శి నవీన్ రెడ్డి, బైరబోయిన మహారాజు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని బొడ్రాయికి ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** వర్షాలు కురువాలని కోరుతూ మండలంలోని గుడిబండ తండలో మంగళవారం మహిళలు బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయికి మహిళలంతా జల బిందెలతో అభిషేకాలు చేసి సాంప్రదాయ గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ సమయానికి పచ్చని పంటలతో కళకళలాడాల్సిన పొలాలు, ఈ ఏడాది వర్షాలు లేక వెలవెలబోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తండ పెద్దలు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

**ప్రజాపక్షం/డిండి:** నల్గొండ జిల్లా గుండ్లపల్లి మండలంలో పనిచేస్తున్న 8 మంది ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందడం మండలానికి గర్వకారణం అని, భవిష్యత్తులో మండల విద్యాశాఖ మరింత ఉత్సాహంతో పనిచేయడానికి దోహదపడుతుందని మండల విద్యాధికారి పగిడిపాటి నర్సింహ మంగళవారం ఆకాంక్షించారు. ఈ అవార్డులు కేవలం అలంకారానికే పరిమితం కాకుండా భవిష్యత్తులో ఉపాధ్యాయుల బాధ్యతను పెంచడానికి ఉత్సాహాన్ని నింపాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గోప్యానాయక్, యాదయ్య, హరిలాల్, శ్యాంసుందర్, రామారావు, సరితలకు మండల విద్యాశాఖ పక్షాన శుభాకాంక్షలు తెలిపారు.

## సంఘం జిల్లా అధ్యక్షుడిగా బెజ్జం సాయి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఘనంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో ఉన్న తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మంగళవారం తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి సమక్షంలో దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామ సర్పంచ్ బెజ్జం సాయిని నల్లగొండ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చింతలపూడి భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చాట్ల చిరంజీవిలను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా చింపుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని సర్పంచులు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు సర్పంచులందరికీ బెజ్జం సాయి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, నూతన సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు బెజ్జం సాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతలపూడి భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చాట్ల చిరంజీవి, జిల్లాలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.